నేడు డయల్ యువర్ డీఎం

హయత్‌నగర్, డిసెంబర్ 19 : హయత్‌నగర్ మండల పరిధిలోని ప్రయాణికుల కోసం ఆర్టీసీ బస్సు సర్వీసులపై, సమస్యలు, సూచనలు, సలహాలపై శుక్రవారం ఉదయం 12 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు 'డయల్ యువర్ డీఎం'కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ విజయ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు తమ విలువైన సలహాలు, సూచనలు చేయాలని, డయల్ చేయాల్సిన నంబర్ 9959226138 లో సంప్రదించాలని కోరారు.

టీచర్‌పై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న అయ్యప్ప స్వాములు, పేరెంట్స్

ఎల్బీనగర్, డిసెంబర్ 19: అయ్యప్ప స్వామి మాల వేసిన విద్యార్థిపై అనుచితంగా వ్యవహరించిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని అయ్యప్ప స్వామి భక్తులు, పేరెంట్స్ దిల్‌సుఖ్‌నగర్ నారాయణ పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వసికరణ అనే విద్యార్థి అయ్యప్ప మాల ధరించాడు. ఈ విద్యార్థిపై అనుచితంగా జోసఫ్ ప్రేం రాజా అనే టీచర్ వ్యవహరించి అయ్యప్ప మాల ధరించినందుకు కర్రతో కొట్టడంతో పాటుగా బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపిస్తూ విద్యార్థి కుటుంబ సభ్యులు, అయ్యప్ప మాల ధారులు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఉపాధ్యాయుడు క్షమాపణ చెప్పాలని, యాజమాన్యం సదరు టీచర్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో అయ్యప్ప గురుస్వామి భార్గవ, కార్పొరేటర్ బద్దం ప్రేం మహేశ్వర్‌రెడ్డితో పాటుగా పలువురు పాల్గొన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

అంబర్‌పేట, డిసెంబర్ 19: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన అవమానకరమైన వ్యాఖ్యలపై ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని, అతడిపై ఎస్సీ ,ఎస్టీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కేవీపీఎస్ అంబర్‌పేట జోన్ కమిటి ఆధ్వర్యంలో తిలక్‌నగర్ చౌరస్తాలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు మహేందర్, జిల్లా కార్యదర్శి సుబ్బా రావు, రాములు, అర్జున్, జనార్దన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్కార్‌ను గద్దె దించుతాం

- వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు అసెంబ్లీ ముట్టడి
- హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

మాల మహానాడు నాయకులను అరెస్ట్ చేసి కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు

బడంగ్‌పేట, డిసెంబర్19: మహేశ్వరం నియోజకవర్గం వ్యాప్తంగా మాలలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మాల మహానాడు రాష్ట్ర కమిటీ చలో అసెంబ్లీకి పిలుపు నిచ్చిన నేపథ్యంలో మాల సంఘం నాయకులను అదుపులోకి తీసుకున్నారు. బాలాపూర్‌కు చెందిన గుండె నాగార్జునను బాలాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. యంగల యాదగిరి, రాజలింగ, సత్యనారాయణ, కోటేశ్వర్ రావు, నాగరాజు, బాల కృష్ణ తదితరులను కంచన్ భాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. మాలలతో పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పతనం ఖాయమన్నారు. మాలలు నిరసన తెలిపే హక్కులేదా అని వారు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాలల పై వివక్షత చూపుతుందన్నారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

బాలాపూర్ పోలీస్ స్టేషన్‌లో నాగార్జున

సైదాబాద్: ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇస్తున్న సీఎం రేవంత్ రెడ్డి వైఖరికి నిరసనగా తెలంగాణ మాల మహానాడు ఇచ్చిన పిలుపు మేరకు గురువారం అసెంబ్లీ ముట్టడిలో పాల్గొన్న తెలంగాణ మాల మహానాడు నాయకులను పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్న 10 మంది మాల మహానాడు నాయకులను అరెస్ట్ చేసి కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కంచన్‌బాగ్ పోలీసుల అదుపులో ఉన్న నాయకుల వివరాలను సేకరించిన అనంతరం వ్యక్తిగత పూచీకతుపై విడుదల చేశారు.

ఆర్కేపురం: సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణకు సహకరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలంగాణ మాలల ఐక్యవేదిక అధ్యక్షుడు బేర బాలకిషన్ అన్నారు. శుక్రవారం మాలల అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో సరూర్‌నగర్ పోలీసులు బేర బాలకిషన్‌ను మందస్తు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఒంటెద్దు పోకడలకు నిరసనగా ఒకే కులానికి కొమ్ము కాస్తూ మాల కులంపై ఇష్టానుసారంగా మాట్లాడుతూ మాలలపై తన ద్వేషాన్ని వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. మాలల మద్దతుతో అధికార గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ఈ రోజు మాలలను విస్మరిస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డి తన ధోరణిలో మార్పు రాకుంటే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి, రేవంత్‌రెడ్డికి రాజకీయ జీవితం దొందపెట్టడం ఖాయమని హెచ్చరించారు.

వనస్థలిపురం: అసెంబ్లీ ముట్టడి సందర్భంగా ఎస్సీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గంగం శివ శంకర్, మాల మహానాడు రంగారెడ్డి జిల్లా యూత్ అధ్యక్షుడు చేపూరి శంకర్, ఎల్బీనగర్ యూత్ నాయకులు అచ్యుత్‌ను గురువారం వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో మాల మహానాడు నాయకులు

బేర బాలకిషన్‌ను ముందస్తు హౌస్ అరెస్ట్ చేసిన సరూర్‌నగర్ పోలీసులు

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



కర్మన్‌ఘాట్ పాఠశాలలో మెనూను పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి

చంపాపేట, డిసెంబర్ 19: విద్యార్థుల ఆహారంపై అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కొంతం గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ప్రతి రోజు విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని అందించాలని, నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. గురువారం ఆయన తన బృందంతో రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం పరిధి కర్మన్‌ఘాట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోనివంటగదిని, వంటకు వినియోగించే బియ్యం, నూనె, ఉప్పు, పప్పులతో పాటు నిత్యావసర సరుకులను పరిశీలించి వంటగది పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం ఎలా ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో కొందరు విద్యార్థులు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని చెప్పడంతో ఆగ్రహించి ఆయన పాఠశాల విద్యార్థులకు రోజువారీగా అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం ఎందుకు పెట్టడం లేదని పాఠశాల ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ భూషణ్‌ను, ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నించారు. అంతే కాకుండా ఇలాగే కొనసాగితే చర్యలు తప్పవని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

భోజనం చేస్తూ సూచనలు..

విద్యార్థులకు అందించే భోజనం మెరుగ్గా, రుచికరంగా ఉండే విధంగా చూసుకోవాలని, ఇదే విధంగా కోడిగుడ్లు ఉడికించిన అరగంటలోపే విద్యార్థులకు ఇవ్వాలని, అలా ఇస్తేనే విద్యార్థులకు పోషకాలు అందుతాయన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టడానికి ముందు ఉపాధ్యాయులు తిని రుచి చూసిన తరువాతే వడ్డించాలని పాఠశాల బాధ్యులను గోవర్ధన్‌రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలలో ఫిర్యాదుల బాక్స్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలా ఏర్పాటు చేస్తే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను కాగితంపై రాసి బాక్స్‌లో వేసి ప్రభుత్వంలోని సంబంధిత అధికారులకు తెలియజేసే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎఫ్ యాక్ట్-2013 ఫుడ్ సెక్యూరిటీ రూల్స్‌ను సంపూర్ణంగా వివరించారు.

రక్తదానం మహాదానం

ఆర్కేపురం, డిసెంబర్ 19 : రక్తదానం మహాదానమని షైన్ చారిటబుల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ముస్తఫా అన్నారు. గురువారం ఐబీఎస్ బిజినెస్ స్కూల్లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలను రక్షించిన వారు అవుతామని చెప్పారు. సమయానికి రక్తం అందక చాలా మంది చనిపోతున్నారని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్, డిసెంబర్ 19 : పేద ప్రజలకు సీఎం సహాయనిధి వరంలాగా ఉపయోగపడుతుందని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పాతబస్తీ ఫంజేషాలోని క్యాంపు కార్యాలయంలో మలక్‌పేట నియోజకవర్గ పరిధిలోని 42 మందికి రూ. 16 లక్షల 13 వేల రూపాయల సీఎం సహాయ నిధి బాధితులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో దవాఖానలకు వెళ్లే రోగులకు సీఎం సహాయనిధి కొంతమేరకు తోడుగా నిలుస్తుందని, ఆరోగ్య సమస్యలను ఇబ్బందులు ఎదుర్కొన్నవారందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రోడ్లకు మరమ్మతులు చేయించాలి

రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, అధికారులు

వనస్థలిపురం, డిసెంబర్ 19 : డివిజన్ లోని కాలనీలో రోడ్లకు మరమ్మతులు సత్వరమే చేయించాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం డివిజన్‌లోని ఎస్‌కేడీనగర్, వైదేహినగర్ రోడ్లను జీహెచ్ఎంసీ ఏఈ రాజ్‌కుమార్‌తో కలిసి కార్పొరేటర్ లచ్చిరెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైదేహినగర్, ఎస్‌కేడీనగర్‌లోని గణేశ్ ఎల్కట్రికల్స్ నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు రోడ్డుపై గుంతలు పడి వాహనదారులకు ఇబ్బందికరంగా ఉందన్నారు. ఆయా రోడ్లకు సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైదేహినగర్ కాలనీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, నాయకులు శంకరయ్య గౌడ్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

హిందూ, ముస్లింలు ఐక్యంగా ఉండాలి

సమైక్యత ర్యాలీ నిర్వహిస్తున్న జై భారత్ సభ్యులు

మన్సూరాబాద్, డిసెంబర్ 19: ప్రస్తుత తరుణంలో హిందూ, ముస్లిం ఐక్యత దేశానికి ఎంతో అవసరమని జై భారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణమూర్తి తెలిపారు. అష్పాల్ బిస్మిల్ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం ఎల్బీనగర్, సూర్యోదయకాలనీలోని జై భారత్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. జై భారత్ ఉద్యమం, జయహో సంయుక్త ఆధ్వర్యంలో హిందూ, ముస్లింలతో కలిసి జై భారత్ సభ్యులు, సమైక్యత వాదులు జై భారత్ కార్యాలయం నుంచి చంద్రపురి కాలనీ మీదుగా ఎల్బీనగర్ రింగ్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మూర్తి మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా జైభారత్ ఆధ్వర్యంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. జయహో జాతీయ అధ్యక్షుడు విజయశంకర స్వామి మాట్లాడుతూ మతోన్మాదమే దేశానికి తీవ్రమైన సమస్యగా మారిందన్నారు. కార్యక్రమంలో జైభారత్ జాతీయ కార్యదర్శులు ఖదిజ్జాసి లోక్‌నాథ్, ఖదిజ్జాసి రజనీ, ఉపాధ్యక్షులు వంశీ, వెంకన్న, జైభారత్ ముస్లిం రెవల్యూషన్ ఫోరం కన్వీనర్ సలీమ్, జయహో జాతీయ నాయకులు మల్లికా వల్లభ, లక్ష్మేశ్వర్, రాజు, లావణ్య, ఉమ, లక్ష్మి పాల్గొన్నారు.

ఉడ్‌వర్క్ షాపులో అగ్నిప్రమాదం

సైదాబాద్, డిసెంబర్ 19 : ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారు జామున భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకొంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం...మాదన్నపేట ఈద్గా సమీపంలో ఉన్న సూపర్ ఫైన్ ఉడ్ వర్క్ షాపులో మంటలు ఎగిసిపడ్డాయి. ఉదయం నాలుగున్నర గంటల ప్రాంతంలో షాపులో మంటలు ఎగిసి పడుతుండటంతో గమనించిన స్థానికులు ఐఎస్ పోలీస్‌స్టేషన్ పోలీసులకు సమాచారం అందిచారు. దీంతో అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించి అప్రమత్తం చేయటంతో వారు సకాలంలో విచ్చేసి మంటలను అదుపుచేశారు. ఎగిసి పడుతున్న మంటలను మలక్‌పేట, చాంద్రాయణగుట్ట, మొఘల్‌పురా, యాకుత్‌పురాలకు చెందిన అగ్నిమాపక కేంద్రాల ఫైర్ ఇంజన్లు మంటలను ఆర్పివేయటంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాప్తి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బీజేపీని భూస్థాపితం చేయాలి

అమిత్‌షా రాజీనామా చేయాలని అల్మాస్‌గూడ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

బడంగ్‌పేట, డిసెంబర్19: భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను పదవి నుంచి తొలగించాలని బీఎస్పీ నాయకుడు బహుగుణ డిమాండ్ చేశారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో అంబేద్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజ్యాంగ బద్ధమైన పదవులలో ఉండి రాజ్యాంగ నిర్మాతను అవమానించిన ఆయనపై దేశ ద్రోహం కేసు పెట్టాలన్నారు. మతోన్మాద శక్తులు అంబేద్కర్‌ను రాజ్యసభలో తక్కువ చేసి మాట్లాడటం ఎంత వరకు సమంజసమన్నారు. అమిత్ షా అహంకార ధోరణితో మాట్లాడుతున్నారని అన్నారు. ఇలాంటి వారికి బహుజనులు బుద్ధి చెప్పవలసిన సమయం ఆసన్నమయిందన్నారు. రానున్న రోజులలో రాజ్యాంగాన్ని మార్చడానికి కుట్రలు చేస్తున్నారని ఆయన అన్నారు. బహుజనులు అంతా ఏకతాటిపై వచ్చి బీజేపీ భూస్థాపితం చేయవలసిన అవసరం ఉందన్నారు. అఖిల్ నాయక్, యుగేందర్ నాయక్ తదితరులు

సైదాబాద్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని డీఎస్ నగర లోని అంబేద్కర్ విగ్రహం వద్ద హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు లడ్డూ పటేల్, నాగిళ్ల శ్రీరాములు, గన్ని భాయ్, కృష్ణ, ప్రేమ్‌కుమార్, నజీర్, మల్లి కార్జున్ తదితరులు నిరసన తెలిపారు.

అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి..

మన్సూరాబాద్: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పాటు పడిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించడం అంటే భారత రాజ్యాంగాన్ని అవమానపర్చినట్లేనని రాష్ట్ర రోడ్డు భవనాల కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ నామ జపం జేసే బదులు దేవుడి జపం చేస్తే స్వర్గానికి పోతారంటూ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను పార్లమెంటులో అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా గురువారం ఎల్బీనగర్ లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద లింగోజిగూడెం కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ కేంద్ర మంత్రి అమిత్‌షా తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవడంతో పాటు దేశ ప్రజలకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిద్దెల జితేందర్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, మల్లారపు శాలిని, జోగు రాములు, జైపాల్‌రెడ్డి, బుడ్డ సత్యనారాయణ, ఎండీ షరీఫ్, ఇరిగి రమేశ్, మన్నెం అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని డీఎస్ నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

సాంకేతిక పరిజ్ఞానం అందించడమే లక్ష్యం

మన్సూరాబాద్, డిసెంబర్ 19: అభివృద్ధి చెందుతున్న దేశాలకు వివిధ రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం లక్ష్యంగా జీఎస్ఐటీఐ పని చేస్తుందని డీడీజీ, హెడ్ ఆఫ్ ఆఫీస్ జీఎస్ఐటీఐ డాక్టర్ ఎస్. రవి తెలిపారు. ఎల్బీనగర్, బండ్లగూడలోని జీఎస్ఐటీఐ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ అభివృద్ధి చెందుతున్న దేశాల భూ విజ్ఞాన శాస్త్రజ్ఞుల కోసం నిర్వహించిన రిమోట్ సెన్సింగ్, డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్‌పై 14వ కోర్సు శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై యువ శాస్త్రవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో స్పాన్సర్ చేసిన ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్ (ఐటీఈసీ) కార్యక్రమం ద్వారా ఈ శిక్షణ కోర్సును ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా నేర్చుకున్న సాంకేతికతలను వారి వృత్తిలో ఉపయోగించుకుని నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. నవంబర్ 27 నుంచి డిసెంబర్ 17 వరకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో 14 దేశాలకు చెందిన 22 మంది యువ శాస్త్రవేత్తలు పాల్గొన్నారన్నారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణను పూర్తి చేసుకున్న యువ శాస్త్ర వేత్తలకు సర్టిఫికెట్లు, మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కోర్సు సమన్వయకర్త, డైరెక్టర్ ఏబీ ఎక్కా పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న శాస్త్రవేత్తలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం

సిద్ధ అగస్తియార్ విగ్రహానికి పూజలు

పూజలు చేస్తున్న సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ జి.పి. ప్రసాద్, తదితరులు

సైదాబాద్, డిసెంబర్ 19 : సైదాబాద్ గడ్డి అన్నారంలోని ఆయుర్వేద వైద్య విధాన పరంపర సంస్థ (ఆయుష్)లో గురువారం సిద్ధ అగస్తియార్ జన్మ నక్షత్రం సందర్భంగా 8వ సిద్ధ దినోత్సవాన్ని నిర్వహించినట్లు ఆయూష్ సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ జి.పి. ప్రసాద్ తెలిపారు. సిద్ధ అగస్తియార్ (అగస్త్య మహర్షి) విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సిద్ధ వైద్యం గురించి వివరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తల్లీ ఇద్దరు పిల్లల్లు అదృశ్యం

హయత్‌నగర్, డిసెంబర్ 19 : ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తల్లి మందుల సరిత, ఇద్దరు పిల్లలు అనన్య, ఆద్యతో కలిసి నాలుగు నెలల క్రితం నగరానికి వచ్చి హయత్‌నగర్‌లోని వీరభద్రనగర్ కాలనీలో నివాసముంటున్నారు. సరిత భర్త ఏషబ్‌తో గొడవ పడి పిల్లలతో కలిసి వేరుగా ఉంటుంది. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో ఆమె షూటింగ్ వర్క్‌కి వెళ్తూ ఉండేది. రూమ్ ఛేంజ్ అయిన తర్వాత కొన్నిరోజులు సరిత, అక్క కుమారుడికి ఫోన్ మాట్లాడుతుండేది. ఇటీవల కొద్ది రోజులుగా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో రూమ్‌కి వెళ్లి చూడగా ఖాళీ చేసి ఉన్నది. ఇంటి యజమానిని అడుగగా ఆమె ఎప్పుడో ఖాళీ చేసి వెళ్లిందని చెప్పాడు. దీంతో ఆందోళనకు గురైన వారు ఆమె ఆచూకీ కోసం చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా దొరకలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శాంతినగర్‌లో బాలిక..

స్ఫూర్తి(ఫైల్)

హయత్‌నగర్: ఇంటి నుంచి వెళ్లిన బాలిక అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో దద్దనల్ల నాగమణి, రాంచందర్ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. రెండో కుమార్తె స్ఫూర్తి 6వ తరగతి వరకు చదువుకుని ఇంటి వద్దనే ఉంటుంది. రోజు మాదిరిగానే కూలీ పనులకు వెళ్లిన నాగమణి ఇంటికి వచ్చి చూడగా కుమార్తె కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన ఆమె కూతురు ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా దొరకలేదు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.